సాక్షి
నిజామాబాద్
శనివారం । 23 । మార్చి । 2024



రైతులను ఆదుకోవాలి

అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఎంపీ అర్వింద్ డిమాండ్ చేశారు.

- 8లో ▸



గరిష్టం/కనిష్టం
37.0 /21.8

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నవోదయలో విచారణ

నిజాంసాగర్: నిజాంసాగర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయంలో గురువారం చోటు చేసుకున్న ఘటనపై శుక్రవారం బాన్సువాడ రూరల్ సీఐ సత్యనారాయణ విచారణ చేపట్టారు. విద్యాలయంలో రాత్రి వేళ డిన్నర్ సమయంలో మైగ్రేషన్ విద్యార్థులు, స్థానిక విద్యార్థుల మధ్య మాటామాటా పెరిగి దాడికి దారి తీసిన విషయం తెలిసిందే. విద్యార్థులు దాడి చేసుకోవడంతో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అన్నదమ్ముల్లా కలిసి ఉండాలని సూచించారు.

మార్కెట్‌యార్డుకు వరుస సెలవులు

- హోలీ, ఆర్థిక సంవత్సరం ముగింపు లెక్కల కారణంగా..

సుభాష్‌నగర్: నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డుకు హోలీ, ఆర్థిక సంవత్సరం ముగింపు లెక్కల కారణంగా ఈనెల 27, 28 మినహా వరుస సెలవులు ప్రకటించినట్లు సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ వెంకటేశం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మర్చంట్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు ఈనెల 25, 26 తేదీల్లో హోలీ పండుగ సందర్భంగా యార్డు బంద్ ఉంచుతున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 27, 28 తేదీల్లో మాత్రమే పసుపు వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తామని తెలిపారు. అలాగే 2023–24 ఆర్థిక సంవత్సరం ముగింపు లెక్కల కారణంగా 29 నుంచి 31వ తేదీ వరకు యార్డులో వ్యాపార కార్యకలాపాలు నిలిపివేస్తున్నామన్నారు. రైతులు గమనించి పైన తెలిపిన తేదీల్లో యార్డుకు సరుకులు తీసుకురావద్దని కోరా రు. ఏప్రిల్ 1 నుంచి మార్కెట్‌లో కార్యకలాపాలు యథావిధిగా కొనసాగుతాయని పేర్కొన్నారు.

27న నిధి ఆప్కే నికట్

నిజామాబాద్ సిటీ: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఈ నెల 27న నిధి ఆప్కే నికట్ 2.0 కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పీఎఫ్ కమిషనర్ గణేశ్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్‌లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సమావేశం హాల్‌లో, సదాశివనగర్‌లోని గాయత్రి షుగర్ ఫ్యాక్టరీలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పీఎఫ్ చందాదారులు, యజమానులు, పెన్షనర్లు తగిన ఆధారాలతో నిధి ఆప్కే నికట్‌కు హాజరై తమ సమస్యలు పరిష్కరించుకోవాలని కమిషనర్ సూచించారు.

టీచర్లు సమయపాలన పాటించాలి



మోపాల్(నిజామాబాద్‌రూరల్): ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, విధులపై నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని డీఈవో దుర్గాప్రసాద్ సూచించారు. శుక్రవారం నగరశివారులోని బోర్గాం (పి) ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు పదోతరగతి పరీక్షల డ్యూటీలు వేసినందున మిగతా వారు క్రమం తప్పకుండా హాజరు కావాలని తెలిపారు. విద్యార్థులకు అల్పాహారం, ఇతరాత్ర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట హెచ్‌ఎం ధనలక్ష్మి, ఉపాధ్యాయులు, ఫ్రెంసింగ్, మంగ్యా, గోవర్ధన్, దీపా, అనిల్, రమ, తదితరులున్నారు.

నిషేధిత మందులపై ఉక్కుపాదం..

- వరుస దాడులు చేస్తున్న డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు
- పట్టుబడుతున్న నకిలీ, తక్కువ క్వాలిటీ మందులు
- కామారెడ్డి, నిజామాబాద్, బోధన్‌లలో కేసులు నమోదు



రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ, నిషేధిత ఔషధాలు, నిషేధిత ప్రకటనలతో కూడిన మందుల అమ్మకాలపై డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు ఫోకస్ పెట్టారు. ఇందులో భాగంగా వరుస దాడులు చేస్తున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని బోధన్, కామారెడ్డి, నిజామాబాద్‌లలో రెండున్నర నెలల్లో పలుమార్లు అక్రమ నిల్వలపై దాడులు చేశారు. పలువురిపై కేసులు నమోదు చేశారు.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: గత నెలలో హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులు ఇచ్చిన సమాచారంతో నిజామాబాద్ నగరంలో ఇక్కడి అధికారులు పలుచోట్ల దాడులు జరిపి నిల్వ చేసిన నకిలీ ఔషధాలను స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి ప్రాంతంలో ఆహార తయారీ లైసెన్స్ మాత్రమే కలిగిన ఒక తయారీ యూనిట్‌లో 'పాంటాప్రోజోలా' అనే ఎసిడిటీకి వాడే నకిలీ ఔషధాన్ని తయారు చేసి నిజామాబాద్‌కు రవాణా చేయగా ఇక్కడ పట్టుకున్నారు. ఈ నకిలీ మందుపై పంజాబ్‌కు చెందిన ఓ నకిలీ కంపెనీ పేరు ముద్రించారు. ఈ నకిలీ మందులో మెడిసిన్ పాళ్లు సున్నా. నకిలీ మందును 'స్పూరియస్'గా పిలుస్తారు. దీనిపై నిజామాబాద్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కేసు నమోదు చేశారు. అదేవిధంగా నిజామాబాద్‌లో జరిగిన మరో దాడిలో విజయవాడ నుంచి తీసుకొచ్చిన తక్కువ క్వాలిటీ (ఔషధ పాళ్లు చాలా తక్కువ) కలిగిన ఉత్తరాఖండ్‌లోని కార్టెల్ ల్యాబొరేటరీస్‌లో తయారు చేసిన మందులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.

- ఈ నెల 21న కామారెడ్డి జిల్లా కేంద్రంలో దాడులు నిర్వహించారు. నిషేధిత ప్రకటనలతో కూడిన ఔషధాలను విక్రయిస్తున్నట్లు గుర్తించి 'డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమెడీస్ యాక్ట్ 1954' మేరకు కేసు నమోదు చేశారు. ఫార్మా డిస్ట్రిబ్యూటర్స్ బాధ్యులు రుతుస్రావ సమస్యలకు సంబంధించిన రుగ్మతలను తగ్గిస్తుందనే వివరాలను ముద్రించిన లేబుల్స్‌తో కూడిన కోలినాస్ స్పాస్ ట్యాబ్లెట్లను, స్పాస్మోడిక్ డిస్మెనోరియా అనే ఔషధాలను నిల్వచేసినట్లు అధికారులు గుర్తించారు. 1954 చట్టం మేరకు సూచించిన వ్యాధులకు, రుగ్మతలకు సంబంధించి ప్రకటనలు చేయకూడదు. కాగా ఈ చట్టాన్ని అతిక్రమించి ప్రకటన లేబుల్స్‌తో విక్రయాలు చేస్తున్నట్లు గుర్తించారు. సదరు ఔషధాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఔషధాలను ఉత్తరాఖండ్‌లోని వివిమెడ్ ల్యాబ్స్ లిమిటెడ్‌లో తయారు చేశారు. దీంతో ఈ కంపెనీపై కేసు నమోదు చేశారు.

- బోధన్ మండలం కల్దుర్తి గ్రామంలో గత జనవరి 29న డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు దాడులు చేశారు. లైసెన్స్ లేకుండా ఓ ఆర్‌ఎంపీ క్లినిక్‌లో నిల్వ చేసి అమ్ముతున్న యాంటీబయోటిక్స్, స్టెరాయిడ్స్, యాంటీ అల్సర్ డ్రగ్స్, యాంటీ హైపర్‌టెన్సివ్, అనాల్జెసిక్స్ అనే 52 రకాల ఔషధాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.

నిబంధనలు అతిక్రమిస్తే డీలర్లపై కేసులు

అమ్మకాల కోసం లైసెన్స్ లేని రిటైల్ వ్యాపారులకు హోల్‌సేల్ డీలర్లు ఔషధాలు సరఫరా చేయకూడదని కామారెడ్డి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి తెలిపారు. అయినప్పటికీ విక్రయిస్తే హోల్‌సేల్ డీలర్లపై కేసులు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అదేవిధంగా కొన్ని ఔషధాలకు సంబంధించి ఆయా నయమయ్యే రుగ్మతల గురించి లేబుల్స్‌పై ముద్రించకూడదన్నారు.



కామారెడ్డిలో స్వాధీనం చేసుకున్న మందు ఇదే..

నిఘా పటిష్టం..!



రుద్రూర్ శివారులో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

- ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు
- జిల్లాలో 18 చెక్‌పోస్టుల ఏర్పాటు
- జిల్లాలో 437 సమస్యాత్మక కేంద్రాల గుర్తింపు
- ఎన్నికలకు కేంద్ర బలగాలతో బందోబస్తు

ఖలీల్‌వాడి: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు యంత్రాంగం చర్యలు చేపడుతోంది. ప్రస్తుతం కోడ్ అమల్లోకి జిల్లా పోలీసుశాఖ భారీబందోబస్తు ఏర్పాటు చేసింది. ప్రధానంగా తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దుల్లోని రహదారులతో పాటు అంతర్ జిల్లా రోడ్లపై చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా పెట్టింది. అక్రమంగా నగ దు, మద్యం రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు అ ధికారులు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నా రు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ క ల్మేశ్వర్‌లు పోలింగ్ కేంద్రాలు, చెక్‌పోస్టులను పరిశీలిస్తున్నారు. అంతేకాకుండా ఇప్పటికే జి ల్లా అధికారులు ఈవీఎంలను చెకింగ్ పూర్తి చేశారు.

సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

జిల్లాలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. జిల్లాలోని ప్రతి పోలింగ్ కేంద్రంపై నిఘా ఏర్పాటు చేశారు. గత ఎన్నికల్లో అల్లర్లు, సమస్యలను సృష్టించిన వారిపై నిఘా పెట్టనున్నారు. బైండోవర్ కేసులు నమోదు చేయనున్నారు. సమస్యాత్మక గ్రామాలు, పోలింగ్ కేంద్రాలు ఉన్న ప్రాంతాల్లో ఉన్నతాధికారులు, పోలీసులు నిరంతరం పర్యటిస్తూ పరిస్థితులను సమీక్షిస్తున్నారు. జిల్లాలో 1,423 పోలింగ్ కేంద్రాలు ఉండగా అందులో 437 కేంద్రాలు సమస్యాత్మకంగా గుర్తించారు. ఈ కేంద్రాల వద్ద స్థానిక పోలీసులతో పాటు కేంద్ర బలగాలతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఎక్కడా ఘర్షణలు జరుగకుండా చర్యలు తీసుకుంటున్నారు.

కోడ్ ఉల్లంఘనలపై ఫిర్యాదుకు సీ విజిల్

ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు సంబంధించిన సీ విజిల్ యాప్ ద్వారా వచ్చే ప్రతి ఫిర్యాదును పరిశీలించి తగిన చర్యలు తీసుకోనున్నారు. ఓటర్లను మభ్య పెట్టేందుకు అక్రమంగా నగదు, మద్యం రవాణా కాకుండా చూడడంతోపాటు రాజకీయ పార్టీల అభ్యర్థుల ప్రచారాలపై కూడా దృష్టిసారించనున్నారు.

జిల్లాకు రెండు రాష్ట్రాలు, మూడు జిల్లాల సరిహద్దులు

ఎన్నికల సమయంలో డబ్బు, మద్యం తరలించకుండా ఉండేందుకు జిల్లా వ్యాప్తంగా 18 చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. జిల్లాకు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలతో పాటు.. జగిత్యాల, నిర్మల్, కామారెడ్డి జిల్లాలు సరిహద్దులో ఉన్నాయి. దీంతో జిల్లాకు సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాలను తనిఖీలు చేస్తున్నారు. చెక్‌పోస్టుల వద్ద సీఆర్‌పీఎఫ్ బలగాలతో పాటు స్థానిక పోలీసులు, రెవెన్యూ, అటవీ, ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. తనిఖీల్లో భాగంగా రెండు రోజుల క్రితం నిజామాబాద్, జగిత్యాల సరిహద్దు ప్రాంతమైన గండిహనుమాన్ వద్ద పోలీసులు నగదును స్వాధీనం చేసుకున్నారు.

పసుపుబోర్డు ఎక్కడుందో చెప్పాలి

- ఎంపీకి అహంకారం ఎక్కువ
- మళ్లీ బాండ్ పేపర్ డ్రామా
- బీజేపీ, బీఆర్‌ఎస్ మధ్యే పోటీ
- కాంగ్రెస్‌కు మూడోస్థానమే..
- బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్



విలేకరులతో మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్

నిజామాబాద్ నాగారం: 'పసుపు బోర్డు తెచ్చానని గొప్పలు చెప్పడం కాదని.. జిల్లాలో బోర్డు ఎక్కడ ఏర్పాటు చేశారో ఎంపీ అర్వింద్ చూపించాలని.. నిజామాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. ఎంపీకి అహంకారంతో ఉన్నారని.. నిజాంషుగర్ ఫ్యాక్టరీ పేరిట మరోసారి బాండ్ పేపర్ డ్రామా ఆడుతున్నారన్నారని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు అర్వింద్‌ను కచ్చితంగా ఓడిస్తారన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో బాజిరెడ్డి విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్ మధ్యే పోటీ ఉంటుందని, కాంగ్రెస్ మూడోస్థానానికి పరిమితం అవుతుందన్నారు. పసుపుబోర్డు పేరుతో ఇప్పటికే ఎంపీ అర్వింద్ ప్రజలను మోసం చేశారన్నారు. ఆయన ఎంపీ కాకముందే పసుపు క్వింటాలుకు రూ. 17వేలు ధర పలికిందన్నారు. పసుపు దిగుబడి తగ్గినందునే ధర పెరిగిందన్నారు. గత ఐదేళ్లలో ఎంపీ అర్వింద్ అహంకారంతో నడుచుకున్నారని.. ఆయన ఓటమి ఖాయమన్నారు. కేంద్రంలో మోదీ గెలవాలని కానీ.. అర్వింద్, బండి సంజయ్ లాంటి వాళ్లు ఓడిపోవాలని ప్రజలు భావిస్తున్నారన్నారు.

సీఎం రేవంత్ హామీలు అమలు చేయడం లేదు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తున్నారని బాజిరెడ్డి విమర్శించారు. రుణమాఫీ చేయలేదని, రైతుబంధు ఇవ్వలేదని, కల్యాణలక్ష్మికి అదనంగా తులం బంగారం హామీలు ఇచ్చి మోసం చేశారన్నారు. అధికారంలో ఉండి కూడా అబద్ధాలు ఆడుతున్నారన్నారు. తాను ఎంపీగా గెలిచి ప్రశ్నించే గొంతునవుతానని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్‌కు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు.

మిగిలింది వారం రోజులే..

- రూ. 26.71 కోట్ల ఇంటి పన్నులకు రూ. 22.47 కోట్లు వసూలు
- 84.12 శాతం లక్ష్యం పూర్తి
- 120కిపైగా జీపీల్లో వందశాతం..



మోపాల్‌లో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న జీపీ సిబ్బంది

సుభాష్‌నగర్: గ్రామ పంచాయతీల్లో 2023–24 ఆర్థిక సంవత్సరం ఇంటి, కుళాయిల పన్నుల వసూళ్లకు మరో వారం రోజులే గడువు మిగిలి ఉంది. జిల్లాలో రూ. 26.71 కోట్ల లక్ష్యానికి గాను ఇప్పటివరకు రూ. 22.71 కోట్లు(84.12శాతం) వసూలయ్యాయి. ఆర్థిక సంవత్సరం ముగినుండడంతో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా ప్రత్యేక డ్రైవ్ ద్వారా 15 రోజుల వ్యవధిలో 20శాతం వరకు పన్నులు వసూలుచేశారు. 120కిపైగా గ్రామ పంచాయతీల్లో ఇప్పటికే వందశాతం పూర్తయ్యింది. పన్నుల చెల్లింపుల్లో 94.86 శాతంతో రెంజల్ ముందు వరుసలో ఉండగా.. 71.68శాతంతో బాల్కొండ మండలం చివరి స్థానంలో ఉంది.

జిల్లావ్యాప్తంగా 530 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇప్పటి వరకు రూ.22.71 కోట్ల పన్ను వసూలు కాగా.. ఇంకా రూ.4.24 కోట్లు వసూలు కావాల్సి ఉంది. డివిజన్ల వారీగా పరిశీలిస్తే ఆర్మూర్‌లో 83.79శాతం, బోధన్‌లో 85.70, నిజామాబాద్ డివిజన్‌లో 83.58శాతం పన్నులు వసూలయ్యాయి. పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టిసారించారు. పన్నుల వసూళ్ల కోసం గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. కాగా, వందశాతం వసూలైన జీపీల పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు, సిబ్బందిని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

అగ్రస్థానంలో రెంజల్ మండలం

జిల్లాలోని రెంజల్ మండలం పన్నుల వసూళ్లలో 94.86శాతంతో మొదటి వరుసలో ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో మోర్తాడ్ 90.57, ఇందల్వాయి 90.55, ఆర్మూర్ 89.72, ముప్కాల్ 89.70, బోధన్‌లో 89.02, వర్ని 88.42శాతంతో ఉన్నాయి. మిగతా మండలాల్లోనూ 88 నుంచి 74 శాతం వరకు వసూలయ్యాయి. బాల్కొండ మాత్రం 71.68శాతంతో చివరి స్థానంలో నిలిచింది.

క్రమంగా తగ్గుతున్న వసూలు శాతం

జిల్లాలో మూడేళ్లలో ఇంటి, కుళాయి పన్నుల వసూలు శాతం క్రమంగా తగ్గుతూ వస్తోంది. 2021–22వ సంవత్సరంలో రూ. 28.97 కోట్లకు గాను రూ. 27.67 కోట్లు వసూలు చేసి 95.51 శాతం పూర్తి చేశారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.25.20 కోట్లు లక్ష్యంగా కాగా రూ.23.43 కోట్లు వసూలయ్యాయి. అంటే రూ.93.01శాతం లక్ష్యం సాధించారు. 2021–22 సంవత్సరం కంటే డిమాండ్‌తోపాటు వసూలు శాతం కూడా తగ్గింది. అదేవిధంగా 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రూ.26.71 కోట్లకు గాను రూ.22.71 కోట్లు వసూలైంది. మరో వారం రోజుల గడువు మాత్రమే మిగిలి ఉంది. దీంతో లక్ష్యాన్ని చేరుకుంటారా అనేది వేచి చూడాలి.

వందశాతం పూర్తి చేస్తాం



జిల్లాలో మార్చి 25వ తేదీ లోగా వందశాతం పన్నులు వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అందుకు అవసరమైన ప్రత్యేక కార్యచరణతో ముందుకెళ్లాం. స్పెషల్ డ్రైవ్ ద్వారా కేవలం 15 రోజుల్లో 20శాతం పన్నులు వసూలుచేశాం. 28వ తేదీలోగా వందశాతం పూర్తి చేయాలని ఇప్పటికే ఆదేశాలిచ్చాం.

– చక్రవర్తుల తరుణ్ కుమార్, డీపీవో

వాటాధనం వెనక్కి..!

- గొర్రెల పంపిణీపై స్పష్టత కరువు
- వాటా వాపస్ కోరిన లబ్ధిదారుల జాబితా సిద్ధం
- పశుసంవర్ధక శాఖకు దరఖాస్తు చేసుకున్న 190 మంది
- డబ్బులు వేసేందుకు బ్యాంకు ఖాతాలు మరోసారి పరిశీలన
- త్వరలోనే కలెక్టర్ వద్దకు ఫైల్



డొంకేశ్వర్(ఆర్మూర్): గొర్రెల పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టత రాకపోవడంతో డీడీలు కట్టిన లబ్ధిదారులు తమ డబ్బులు వెనక్కి తీసుకోవాలని నిర్ణయానికి వచ్చారు. వాటాధనాన్ని తిరిగివ్వాలని జిల్లా పశుసంవర్ధక శాఖకు చాలామంది దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు 190 మందికి పైగా లబ్ధిదారులు దరఖాస్తులను అధికారులకు అందజేశారు. ఒత్తిడి పెరుగుతుండడంతో అధికారులు కూడా వారికి డబ్బులు తిరిగి ఇచ్చేయాలని భావిస్తున్నారు. అయితే, డబ్బులు కావాలని దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను పరిశీలిస్తున్నారు. వాటాధనం వెనక్కి ఇచ్చే క్రమంలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా వారి బ్యాంకు ఖాతాలను ఒకటికి రెండుసార్లు పరిశీలించారు. మండలాల నుంచి వచ్చిన వివరాలతో జిల్లా అధికారులు త్వరలోనే కలెక్టర్‌కు ఫైలు పంపనున్నారు. కలెక్టర్ ఖాతాలోనే లబ్ధిదారులు కట్టిన డబ్బులు ఉన్నాయి. అయితే, వాటాధనం వెనక్కి ఇచ్చే విషయం కలెక్టర్ తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉంది. కలెక్టర్ ఓకే చెబితే వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ చేయనున్నారు.

సగం మందికే అందిన గొర్రెలు..

గత ప్రభుత్వం రెండో విడత కింద జిల్లాకు 8,384 గొర్రెల యూనిట్ల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఇందుకు జిల్లాల్లో గొల్ల, కుర్మ, యాదవులు కలిసి 2వేల మంది డీడీలు కట్టారు. మొత్తం 21 జీవాలుండే ఒక యూనిట్ విలువ రూ. 1.75లక్షలు ఉండగా, సబ్సిడీ కింద ఒక్కో లబ్ధిదారులు రూ. 43,750 వాటాధనాన్ని చెల్లించారు.

అసెంబ్లీ ఎన్నికలకు ముందు అధికారులు 929 మందికి గొర్రెలను అందజేశారు. ప్రభుత్వం మారడంతో 1,071 మందికి గొర్రెలు అందలేదు. గొర్రెలు ఇచ్చే విషయంపై కాంగ్రెస్ ప్ర భుత్వం ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంతో కొన్ని నెలలు వేచిచూసిన లబ్ధిదారులు తమ వాటాధనా న్ని తిరిగివ్వాలని పశుసంవర్ధక శాఖ అధికారులకు దరఖాస్తు చేసుకోవడం మొదలు పెట్టారు. ప్రస్తు తం 190 మందికి పైగా లబ్ధిదారులు డబ్బులు తిరిగివ్వాలని అధికారులను కోరుతున్నారు. ఈ సంఖ్య రానురాను పెరిగే అవకాశం కనిపిస్తోంది. కాగా కొంతమంది ఇంకా వేచిచూసే ధోరణిలో ఉన్నారు.

ఫైల్ తయారు చేస్తున్నాం

డీడీలు కట్టి గొర్రెలు అందని లబ్ధిదారులు తమకు వాటాధనాన్ని తిరిగివ్వాలని దరఖాస్తు చేసుకుంటున్నారు. అలా దరఖాస్తులు చేసుకున్న వారి వివరాలు, బ్యాంకు ఖాతాలను మండల స్థాయిలో పరిశీలన చేసి జిల్లా కార్యాలయానికి తెప్పించుకున్నాం. ఫైల్‌ను తయారు చేసి త్వరలో కలెక్టర్‌కు నివేదిస్తాం.

–జగన్నాథచారి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

మహిళలు ఆత్మస్థైర్యంతో సాగాలి



మహిళా ఉద్యోగులతో కలెక్టర్

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులకు సన్మానం

సుభాష్‌నగర్: మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో మహిళా ఉద్యోగులు సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తూ ఉత్తమ సేవలు అందిస్తున్నారని కొనియాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని టీఎన్జీవోఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఉత్తమ సేవలందించిన మహిళా ఉద్యోగులను సన్మానించారు. మహిళలు తమ ఇంటిని చక్కదిద్దినట్లే సమాజ మార్పునకు కూడా దోహదపడాలని కలెక్టర్ సూచించారు. బాలికల్లో ఆత్మస్థైర్యం పెంపొందిస్తూ, వారిని మానసికంగా దృఢత్వం కలిగి ఉండేలా తల్లిదండ్రులు తోడ్పాటు అందించాలన్నారు. మహిళల రక్షణ, భద్రత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చట్టాలు అమలు చేస్తున్నాయని గుర్తుచేశారు. కార్యాలయాల్లో, పని ప్రదేశాల్లో ఇబ్బందులు ఎదురైతే ఉన్నతాధికారుల దృష్టికి తేవాలని, మహిళల భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీఎన్జీవోఎస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, కార్యదర్శి ఎం నాగరాజు, జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్, జిల్లా ప్రధాన కార్యదర్శి నేతికుంట శేఖర్, డీడబ్ల్యూవో రసూల్ బీ, జిల్లా సాంఘిక సంక్షేమ అభివృద్ధి అధికారిణి శశికళ పాల్గొన్నారు.

క్లుప్తంగా

లక్ష్మికాలువకు తగ్గిన నీటి విడుదల



బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ లక్ష్మి కాలువ హెడ్‌రెగ్యులేటర్‌ ఎత్తిపోతుండటంతో కాలువ ద్వారా నీటి విడుదల తగ్గించారు. కాలువ ద్వారా 250 క్యూసెక్కుల నుంచి 200 క్యూసెక్కుల నీటి సరఫరా తగ్గించారు. కాకతీయ కాలువ ద్వారా 3500 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, అలీసాగర్‌ లిఫ్టు ద్వారా 347 క్యూసెక్కులు, గుత్ప లిఫ్టు ద్వారా 146 క్యూసెక్కులు, ముంపు గ్రామాల లిఫ్టుల ద్వారా 200 క్యూసెక్కులు, మిషన్‌ భగీరథకు 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 472 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్‌ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(90 టీఎంసీలు) అడుగుల కాగా శుక్రవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1064(18.72 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్‌ అధికారులు తెలిపారు.

ప్రాజెక్ట్‌ లోపలికి వెళ్లొద్దు

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ బ్యాక్‌ వాటర్‌ ప్రాంతాలకు వెళ్లొద్దని ముప్కాల్‌ ఎస్సై భాస్కరాచారి శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ప్రాజెక్ట్‌ పరీవాహక ప్రాంతానికి వెళ్లి ప్రమాదాల బారిన పడొద్దని సూచించారు. జలాశయంలో ఫొటో షూట్‌లు చేపట్టవద్దన్నారు. సోమవారం హోళి సందర్భంగా స్నానం చేయడానికి ప్రాజెక్టులోకి వెళ్లొద్దన్నారు. ప్రాజెక్ట్‌ లోపలికి వెళ్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

తనిఖీలు పక్కాగా ఉండాలి



బాల్కొండ: జిల్లా సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లో వాహనాల తనిఖీ పక్కాగా ఉండాలని అదనపు కలెక్టర్‌ కిరణ్‌కుమార్‌ అన్నారు. శుక్రవారం మెండోరా మండలం దూదిగాం శివారులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును తనిఖీ చేశారు. అనంతరం ఆ మండలంలోని దూదిగాం, పోచంపాడ్‌లోని పోలింగ్‌ కేంద్రాలను పరిశీలించారు. తహసీల్దార్‌ సంతోష్‌, ఎంపీడీవో వనజ, ఆర్‌ఐ సాయాగౌడ్‌ తదితరులు ఉన్నారు.

ఇంకుడు గుంతలు, ఫాం పాండ్లు నిర్మించుకోవాలి

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): జిల్లాలో రోజురోజుకు ఇంకిపోతున్న భూగర్భ జలాలను పెంచుకోవాలంటే ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయడమే మార్గమని జిల్లా భూగర్భజల శాఖ డిప్యూటీ డైరెక్టర్‌ దేవేంద్ర ప్రసాద్‌ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లాలో నీటి మట్టాలు వేగంగా తగ్గుతున్నాయని, మోర్తాడ్‌, ఆర్మూర్‌, భీమ్‌గల్‌, వేల్పూర్‌, ధర్పల్లి, సిరికొండ, మండలాల్లో నీటి సమస్య తలెత్తే అవకాశాలున్నాయన్నారు. నీటి కరువును ఎదుర్కోవడానికి ప్రజలు తమ ఇళ్ల వద్ద తక్కువ ఖర్చుతోనే ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇళ్లలో వినియోగించిన నీరంతా ఇంకుడు గుంతలోకి వచ్చేలా చూసుకోవాలన్నారు. రైతులు వ్యవసాయ భూముల్లో ఫాం పాండ్లు కూడా నిర్మించుకుంటే బోర్లు రీచార్జ్‌ అవుతాయని తెలిపారు. నీటి వృథాను కూడా అరికట్టినట్లయితే భూగర్భ జలాలను కాపాడినట్లు అవుతుందన్నారు.

పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

నిజామాబాద్‌ రూరల్‌(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ అనుబంధ కళాశాలల పరిధిలో ఎంబీఏ, ఎంసీఏ, ఐఎంబీఏ కోర్సుల రెగ్యులర్‌, బ్యాక్‌లాక్‌ పరీక్ష ఫీజు గడువు పొడిగించినట్లు కంట్రోలర్‌ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. రూ.వంద అపరాద రుసుముతో ఏప్రిల్‌ 4 వరకు ఫీజు చెల్లించవచ్చన్నారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

మహిళలకు మరింత ఉపాధి

- ఎస్‌హెచ్‌జీలకు స్కూల్‌ యూనిఫాంలు కుట్టే బాధ్యత
- ఒక్కో జతకు రూ.50 ఇవ్వనున్న ప్రభుత్వం
- జిల్లాలో ముందుకొచ్చిన 2,228 మంది మహిళలు



మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు(ఫైల్‌)

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌) : బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలిస్తూ మహిళా సంఘాలను బలోపేతం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వారికి మరింత ఉపాధిని కల్పించే మార్గాలను వెతుకుతోంది. అందులో భాగంగా ఎస్‌హెచ్‌జీ మహిళలకు స్కూల్‌ యూనిఫాంలు కుట్టే బాధ్యతలను అప్పగించింది. ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఆ దిశగా కసరత్తు ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా ఆయా మండలాలు, గ్రామాల్లో టైలరింగ్‌ అనుభవం ఉన్న మహిళలను గుర్తించారు. ఇప్పటి వరకు 2,228 మంది ఎస్‌హెచ్‌జీ మహిళలు యూనిఫాంలు కుట్టేందుకు ముందుకు వచ్చారు. మరింత మంది ముందుకు వచ్చేలా ఐకేపీ అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో 24,598 స్వయం సహాయక సంఘాలు ఉండగా ఇందులో 2,42,057 మంది మహిళలు ఉన్నారు. వీరు ప్రతి ఏడాది బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలను పొందుతున్నారు. రుణాలను పొందుతున్న మహిళల్లో చాలా మంది వ్యాపారాలు చేస్తూ ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. టైలరింగ్‌ షాపులు నిర్వహిస్తున్న మహిళలు సైతం ఉన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలలు, మోడల్‌ స్కూళ్లు, గురుకులాలు, కస్తూర్బాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు అవసరమయ్యే యూనిఫాంలు కుట్టే బాధ్యతలను మహిళా సంఘాల సభ్యులకు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

కుట్టుకూలి పెంచాలంటున్న మహిళలు

యూనిఫాంలు కుట్టేందుకు ప్రభుత్వమే వస్త్రాన్ని జిల్లాకు సరఫరా చేస్తోంది. మహిళలు సంబంధిత పాఠశాలలకు వెళ్లి విద్యార్థుల కొలతలు తీసుకోవాలి. క్లాత్‌ కటింగ్‌తో పాటు అందుకు అవసరమైన బటన్స్‌, ఇతర మెటీరియల్‌ కూడా మహిళలే కొనుగోలు చేయాలి. యూనిఫాంలు కుట్టి ఇచ్చినందుకు గాను ప్రభుత్వం జతకు కేవలం రూ.50 ఇవ్వనుంది. దీనిపై కొంతమంది మహిళలు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. కూలి గిట్టుబాటు కాదని యూనిఫాంలు కుట్టేందుకు మొదట్లో మహిళలు ముందుకు రాకపోగా, అధికారులే సముదాయించి 2,228 మందిని గుర్తించారు. ఇంకా చాల మందిని గుర్తించే పనిలో ఉన్నారు. జతకు కనీసం రూ.100 ఇస్తే బాగుంటుందని మహిళలు కోరుతున్నారు. కుట్టుకూలి పెంచితే మరింత మంది ముందుకు వచ్చే అవకాశం ఉంది. జిల్లాకు 3.26లక్షల యూనిఫాంలు అవసరం ఉండగా, ఈ నెలాఖరు నాటికి విద్యార్థుల కొలతలు తీసుకుని పాఠశాలలు ప్రారంభమయ్యే జూన్‌ 1వ తేదీ నాటికి అందజేయాలని మహిళలకు అధికారులకు సూచించారు.

మహిళలను గుర్తించాం



జిల్లాలో టైలరింగ్‌ అనుభవం ఉన్న మహిళలను గుర్తించాం. క్లాత్‌ రాగానే యూనిఫాంలు కుట్టించే పనిని మొదలు పెడతాం. గడువులోగా యూనిఫాంలు అందజేసేలా చూస్తాం. మహిళా సంఘాల సభ్యులకు ఈ పనితో మరింత ఉపాధి లభిస్తుంది.

– సాయాగౌడ్‌, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి

పురాతన కట్టడాలపై పట్టింపేది?



శిథిలావస్థకు చేరుకున్న గుండారంలోని గడి



నిజామాబాద్‌ రూరల్‌: మండలంలోని గుండారం గ్రామంలో ఉన్న గడి శిథిలావస్థకు చేరింది. సిర్నాపల్లి సంస్థానాన్ని పాలించిన శీలం జానకీబాయి నిజామాబాద్‌ వైపు వచ్చినప్పుడు సేద తీరడానికి గుండారంలో గడి నిర్మించారు. ఆ కోట ప్రస్తుతం పూర్తిగా కూలిపోయింది. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. దీనిపై గ్రామ ప్రత్యేకాధికారి, తహసీల్దార్‌ అనురుధ్‌ను సంప్రదించగా గడి పునరుద్ధరణ కోసం ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తానని చెప్పారు.

షార్ట్‌ ఫిల్మ్‌లతో చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న జిల్లా జడ్జి సునీత కుంచాల

ఖలీల్‌వాడి: న్యాయ సేవాధికార సంస్థ పనితీరును వివరిస్తూ, చట్టాలపై అవగాహన కల్పించేందుకు షార్ట్‌ ఫిల్మ్‌లు ప్రదర్శిస్తున్నట్లు జిల్లా జడ్జి సునీత కుంచాల తెలిపారు. శుక్రవారం నగరంలోని ఉషామయూరి మల్టీప్లెక్స్‌ థియేటర్‌లో ప్రదర్శించిన షార్ట్‌ ఫిల్మ్‌ను జిల్లా జడ్జి, కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్‌, ఇతర అధికారులు తిలకించారు. న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఏ విధంగా సహాయం పొందవచ్చనే అంశాలతో షార్ట్‌ ఫిల్మ్‌లు ప్రదర్శించారు. కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు మాట్లాడుతూ ప్రజలను చైతన్యం చేయడానికి జిల్లా న్యాయసేవాధికార సంస్థ అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోందని అభినందించారు. నేరాల నియంత్రణ దిశగా, చట్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని రూపొందించిన ఈ షార్ట్‌ ఫిల్మ్‌లు ప్రజలందరికీ చేరేవిధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. చిత్రాల నిర్మాణానికి సహకరించిన వారందరికీ డీఎస్‌ఎల్‌ఏ తరఫున జిల్లా జడ్జి కృతజ్ఞతలు తెలిపారు. సీపీ కల్మేశ్వర్‌ మాట్లాడుతూ నేటి సమాజంలో డిజిటల్‌ నేరాలు పెరిగిపోయాయని, వాటి పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేలా షార్ట్‌ ఫిలిం రూపొందించడం గొప్ప విషయమన్నారు. జడ్జి పద్మావతి, నగరపాలక సంస్థ కమిషనర్‌ మకరంద్‌, ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, ట్రెయిని ఐపీఎస్‌ చైతన్యరెడ్డి, షార్ట్‌ ఫిల్మ్‌ల దర్శకుడు సాయిప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

హత్యకేసులో నలుగురికి జీవితఖైదు

ఖలీల్‌వాడి: 'మంత్రాల నెపంతో హత్య' కేసులో నలుగురికి జీవితఖైదు విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల శుక్రవారం తీర్పు చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్‌ జిల్లా ఆర్మూర్‌ పీఎస్‌ పరిధిలోని మామిడిపల్లిలో 2018లో బొణిగె భారతిని నలుగురు కలిసి హత్య చేశారు. బొణిగె భారతి చేతబడి చేయడం వల్లే అనారోగ్యం పాలయ్యానని గ్రామానికి చెందిన తోకల చిత్ర అనుమానం పెంచుకున్నది. తన సమీప బంధువైన బట్టు వెంకటేష్‌ చిత్ర అలియాస్‌ చింటూకు తెలిపి భారతిని హతమార్చాలని చెప్పింది. చింటూ తన స్నేహితులైన పందిర్ల రాజేందర్‌గౌడ్‌, బట్టు రంజిత్‌లకు విషయం తెలిపాడు. ఈ క్రమంలో నలుగురు కలిసి 2018 జూలై 8న మధ్యాహ్నం భారతి ఇంట్లోకి చొరబడ్డారు. వారి వెంట తీసుకువెళ్లిన కత్తితో ఒంటరిగా ఉన్న భారతి గొంతుకోసి చంపారు. భారతి చెవులను కోసి చెవులకు ఉన్న బంగారం, బంగారు చైన్‌ తీసుకున్నారు. దోపిడీ దొంగలు హత్య చేసినట్లు సృష్టించే ప్రయత్నం చేశారు. కాలి, వేలి ముద్రలు, సీసీ కెమెరాల దృశ్యాలు, ఫోన్‌ లొకేషన్‌ ఆధారంగా నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్‌ చేశారు. కేసు విచారణలో భాగంగా చార్జిషీట్‌ ఫైల్‌ చేయగా సాక్ష్యాధారాలను పరిశీలించిన జిల్లా జడ్జి నలుగురికి జీవితఖైదుతో పాటు మరో ఏడు సంవత్సరాల జైలు శిక్ష, రూ. 3వేల జరిమానా విధించారు.

వైద్యుడి నిర్లక్ష్యంతో బాలుడి మృతి!



వికాస్‌

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌లోని శ్రీ లక్ష్మీనర్సింహ ఆనంద్‌ పిల్లల ఆస్పత్రిలో వైద్యుడి నిర్లక్ష్యంతో అంకాపూర్‌కు చెందిన ఏడాది బాలుడు నీలం వికాస్‌ మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. బాధితులు తెలిపిన వివరాలు.. మండలంలోని అంకాపూర్‌ గ్రామానికి చెందిన నీలం మహేందర్‌, గంగ దంపతుల కుమారుడు వికాస్‌కు శుక్రవారం ఉదయం ఫిట్స్‌ వచ్చింది. దీంతో ఆర్మూర్‌లోని ఆనంద్‌ పిల్లల ఆస్పత్రికి తీసుకు వచ్చారు. బాలుడిని పరీక్షించిన వైద్యుడు పరిస్థితి విషమంగా ఉందని జిల్లా కేంద్రానికి తీసుకెళ్లాలని సూచించాడు. దీంతో నిజామాబాద్‌ తరలించడానికి అంబులెన్సు సిద్ధం చేసుకున్న తల్లిదండ్రులకు తానే చికిత్స చేస్తానని వైద్యుడు ఆనంద్‌ చెప్పారు. దీంతో ఆస్పత్రిలో అడ్మిట్‌ చేశారు. మధ్యాహ్నం సమయంలో వికాస్‌కు మరోసారి ఫిట్స్‌ వచ్చింది. ఆ సమయంలో వైద్యుడు అందుబాటులో లేక పోవడంతో సిబ్బంది చికిత్స చేసి వైద్యుడికి సమాచారం ఇచ్చారు. ఆయన ఆస్పత్రికి వచ్చి బాలుడిని పరీక్షించి మృతి చెందాడని చెప్పారు. వైద్యుడి నిర్లక్ష్యం కారణంగానే తమ కుమారుడు మృతి చెందాడని తల్లిదండ్రులు ఆందోళన చేశారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

డ్రంకన్‌ డ్రైవ్‌ కేసులో జైలుశిక్ష

రాజంపేట: మద్యం తాగి వాహనం నడిపిన ఒకరికి జిల్లా రెండో తరగతి జ్యుడిషియల్‌ మేజిస్ట్రేట్‌ జైలు శిక్ష విధించారు. రాజంపేట పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టగా గ్రామానికి చెందిన నర్సింలు డ్రంకన్‌ డ్రైవ్‌లో దొరికాడు. శుక్రవారం ఆయనను కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రెండు రోజుల జైలు శిక్ష, రూ.200 జరిమానా విధించినట్లు ఎస్సై సంపత్‌ తెలిపారు.

ఖలీల్‌వాడి: డ్రంకన్‌ డ్రైవ్‌ కేసులో ముగ్గురికి జైలు శిక్ష విధించినట్లు ఏసీపీ నారాయణ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపిన పది మందిని శుక్రవారం జడ్జి సయ్యద్‌ ఖదీర్‌ ఎదుట హాజరుపర్చగా బచ్చల నాగరాజు, మోగులురి వెంకటేశ్వర్లుకు మూడు రోజులు, లక్కరాజు శ్రీనివాస్‌కు నాలుగు రోజుల శిక్ష విధించారు. మిగతా వారికి జరిమానా వేశారు.

వృద్ధుడి అదృశ్యం

కామారెడ్డి క్రైం: పట్టణంలోని పంచముఖి హనుమాన్‌ కాలనీకి చెందిన మైలారం బాలయ్య(68) అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌ రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ నెల 14న ఇంటి నుంచి వెళ్లిన బాలయ్య తిరిగి రాలేదు. ఆయనకు మతిస్థిమితం సరిగా లేదని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. చాలా చోట్ల గాలించినా ఆచూకీ దొరకలేదు. దీంతో బాలయ్య కోడలు తులసి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

ఖలీల్‌వాడి: నగరంలోని గాజుల్‌పేట్‌కు చెందిన బైరి రోహిత్‌ (26) ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రామ్‌ శుక్రవారం తెలిపారు. రోహిత్‌ మున్సిపాలిటీలో ఔట్‌ సోర్సింగ్‌ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

యువకులపై కేసు నమోదు

మోపాల్‌: మండలంలోని మంచిప్పకు చెందిన నలుగురు యువకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గంగాధర్‌ శుక్రవారం తెలిపారు. వివరాలు.. గ్రామంలోని ప్రాజెక్టుకు వెళ్లే బైపాస్‌ రోడ్డులో బుధవారం రాత్రి సమీర్‌, సాగర్‌, నందు, వీరేందర్‌ మద్యం తాగుతున్నారు. ఆ సమయంలో మూత్ర విసర్జన కోసం వచ్చిన పల్లికొండ సాయి వీరిని మందలించాడు. ఈక్రమంలో వీరి మధ్య వాగ్వాదం జరగడంతో పరస్పర దాడులకు దిగారు. సాయిని కొడుతుండగా అరుపులు విన్న సాయి తండ్రి వద్దిరాజు అక్కడికి వచ్చాడు. నలుగురు కలిసి వద్దిరాజును తీవ్రంగా చితకబాదారు. దీంతో నలుగురు యువకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వైద్యాధికారి మృతి



రాజ్‌కుమార్‌(ఫైల్‌)

మోర్తాడ్‌: ఏర్గట్ల మండలం బట్టాపూర్‌ శివారులో గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నిర్మల్‌ జిల్లా కడెం మండల వైద్యాధికారి రాజ్‌కుమార్‌(32) మృతి చెందాడు. మెండోరా మండలం సావెల్‌కు చెందిన రాజ్‌కుమార్‌ కడెంలో విధులు నిర్వహిస్తున్నాడు. వ్యక్తిగత పనులపై బట్టాపూర్‌ వచ్చి సావెల్‌కు వెళ్తుండగా కారు అదుపు తప్పి చెట్టుకు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి మరణించాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు.

సోలార్‌ ప్లాంట్‌లో కరెంట్‌ షాక్‌తో ఒకరు..



ఈశ్వర్‌ (ఫైల్‌)

మాచారెడ్డి: సోలార్‌ ప్లాంట్‌లో కూలీ పని చేస్తున్న ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు కరెంట్‌ షాక్‌తో మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. పాల్వంచ మండలం ఫరీదుపేట గ్రామానికి చెందిన దుమ్మాల ఈశ్వర్‌(35) శుక్రవారం గ్రామ శివారులోని సోలార్‌ ప్లాంట్‌లో కూలీ పని చేయడానికి వెళ్లాడు. ప్లాంటులో పెరిగిన పచ్చ గడ్డిని తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్‌ షాక్‌కు గురయ్యాడు. స్థానికులు చికిత్స నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

రైలులో నుంచి పడి వృద్ధుడు..

ఖలీల్‌వాడి: రైలు నుంచి పడి గుర్తు తెలియని వృద్ధుడు(70) మృతి చెందినట్లు ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. నగర శివారులోని మిర్చి కాంపౌండ్‌ దగ్గర గుర్తు తెలియని రైలులో నుంచి జారిపడి మృతి చెందాడన్నారు.

రైతులను ఆదుకోవాలి

- ఎకరాకు రూ.25 వేల పరిహారం అందించాలి
- ఎంపీ అర్వింద్‌

ఎడపల్లి: అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల పరిహారం అందించి ఆదుకోవాలని ఎంపీ అర్వింద్‌ డిమాండ్‌ చేశారు. ఎడపల్లి మండలంలోని దూపల్లి గేట్‌ వద్ద అకాల వర్షాలు, వడగండ్లతో నష్టపోయిన పంటలను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలో అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను పట్టించుకోలేదన్నారు. రాష్ట్రంలో ఫసల్‌ బీమా పథకం అమలు చేయకపోవడంతో రైతులకు పరిహారం రావడం లేదన్నారు. కాంగ్రెస్‌ గ్యారంటీలను అమలు చేయాలంటే రూ.2 లక్షల కోట్లు అవుతుందన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం సమకూర్చుకోవడానికి జాగ్రత్తలు తీసుకోవడం లేదన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డీ మోహన్‌రెడ్డి, మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, బోధన్‌ అసెంబ్లీ కన్వీనర్‌ శ్రీధర్‌, మండలాధ్యక్షుడు కోలా ఇంద్రకరణ్‌, రెంజల్‌ జెడ్పీటీసీ మేక సంతోష్‌, ఎంపీపీ రజిత కిశోర్‌, సృజన్‌, కోటేష్‌ పాల్గొన్నారు.



దూపల్లి గేట్‌ వద్ద వరి పంటను పరిశీలిస్తున్న ఎంపీ అర్వింద్‌

'పల్లా'కు మతిభ్రమించింది

- అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకుంటాం
- రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌ అన్వేష్‌రెడ్డి



మాట్లాడుతున్న అన్వేష్‌రెడ్డి

ఖలీల్‌వాడి: జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మతిభ్రమించి మాట్లాడుతున్నారని రాష్ట్ర సీడ్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌, కిసాన్‌ కాంగ్రెస్‌ రాష్ట్ర అధ్యక్షుడు సుంకెట అన్వేష్‌రెడ్డి విమర్శించారు. నగరంలోని కాంగ్రెస్‌ భవన్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి రైతు సమన్వయ సమితి ఉన్న అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ప్రకతి వైపరీత్యాలు వచ్చినా స్పందించలేదన్నారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలో పంట నష్టపోయిన రైతులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. అకాల వర్షాలతో నష్టపోయిన పంటలపై సర్వే చేయిస్తున్నట్లు చెప్పారు. సర్వే కాకుండానే రెండు లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు రాజేశ్వర్‌రెడ్డి ఎలా చెబుతారని ప్రశ్నించారు. నష్టపోయిన రైతులను ఆదుకుంటామన్నారు. ఉర్దూ అకాడమీ చైర్మన్‌ తాహెర్‌ బీన్‌హందాన్‌, కిసాన్‌ కాంగ్రెస్‌ జిల్లా అధ్యక్షుడు గంగారెడ్డి, సిరికొండ గంగారెడ్డి, అల్లూరి మహేందర్‌ రెడ్డి, శశిధర్‌రెడ్డి, సుంకెట బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

హత్య చేసేందుకు వచ్చి బైక్‌ చోరీ

- దొంగతనం కేసులో అరెస్ట్‌
- విచారణలో వెలుగులోకి నిజం

కమ్మర్‌పల్లి: ఒకరిని హత్య చేయడానికి వచ్చిన వారు.. అక్కడకు వెళ్లడానికి బైక్‌ చోరీ చేశారు. చోరీ కేసు విచారణలో వారిని అదుపులోకి తీసుకోగా హ త్య చేయడానికి వచ్చినట్లు ఒప్పుకున్నారు. కమ్మర్‌పల్లి ఎస్సై రాజశేఖర్‌ తెలిపిన వివరాలు.. మోర్తాడ్‌కు చెందిన ఎడ్డి చిన్నారెడ్డి, ఆయన సోదరుడు ఎడ్డి నర్సయ్యకు మధ్య భూ వివాదం ఉంది. భూమిపై నర్సయ్య కోర్టులో కేసు వేశాడు. దీంతో ఆ భూమి క్రయవిక్రయాలకు బ్రేక్‌ పడింది. చిన్నారెడ్డి కొడుకు సుధాకర్‌కు అప్పులు ఉండగా డబ్బులు అవసరమయ్యాయి. ఆ భూమిని విక్రయించి అప్పులు తీర్చా లని భావించాడు. కానీ కోర్టులో కేసు ఉండడంతో విక్రయించడానికి వీలు లేకుండా పోయింది. దీంతో సుధాకర్‌ తన పెదనాన్న నర్సయ్యను హతమార్చాలని పథకం వేశాడు. ఫేస్‌బుక్‌ ద్వారా పరిచయం అయిన ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడకు చెందిన వెన్నదుర్గా దినేష్‌ అలియాస్‌ సాయిని సంప్రదించాడు. నర్సయ్యను హతమార్చడానికి రూ.2.50 లక్షలకు బేరం కుదుర్చుకున్నాడు. ఇద్దరు కలిసి విజయవాడ నుంచి ఈ నెల 18న అర్ధరాత్రి 2:30 గంటలకు కమ్మర్‌పల్లిలో బస్సు దిగారు. ఉప్లూర్‌ రోడ్‌లోని ఓ ఇంటి వద్ద ఉన్న బైక్‌ను దొంగిలించి దానిపై మోర్తాడ్‌ వెళ్లారు. నర్సయ్య ఇల్లు, మోర్తాడ్‌ వడ్యాట్‌ రోడ్‌లోని వ్యవసాయ భూమిని పరిశీలించారు. శుక్రవారం కమ్మర్‌పల్లి, వడ్యాట్‌ రోడ్‌లో ఉదయం వీరు అనుమానాస్పదంగా కనిపించడంతో బైక్‌ దొంగిలించారనే అనుమానంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారించగా అసలు విషయం వెలుగు చూసింది. తాము నర్సయ్యను హతమార్చడానికి వచ్చామని, మోర్తాడ్‌ వెళ్లడానికి బైక్‌ అవసరం కాగా చోరీ చేశామని ఒప్పుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

బాలికను కొనుగోలు చేసి బలవంతపు వ్యభిచారం

- ముగ్గురు నిందితుల అరెస్టు

కామారెడ్డి క్రైం: తల్లిదండ్రులు లేని బాలికను బంధువుల నుంచి కొనుగోలు చేసి వ్యభిచారం చేయిస్తున్న ముగ్గురు వ్యక్తులను కామారెడ్డి పట్టణ పోలీసులు శుక్రవారం అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డిలోని ఓ కాలనీకి చెందిన బాలికకు తల్లిదండ్రులు లేరు. తన చిన్నమ్మ వద్ద నివసిస్తుంది. కొత్త బస్టాండ్‌ ప్రాంతంలో వ్యభిచారం నిర్వహించే ఓ ముఠా ఆమెపై కన్నేసింది. మైనర్‌ అని కూడా చూడకుండా ఆమె చిన్నమ్మ వద్ద నుంచి డబ్బులకు కొనుగోలు చేశారు. ఈ క్రమంలో బాలికను బలవంతంగా వ్యభిచారం చేయిస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదు వచ్చింది. దీంతో నిందితులైన సంపంగి లక్ష్మి, ఆమెతో సహజీవనం చేస్తున్న సుంకరి శంకర్‌, వారికి సహకరిస్తూ తన లాడ్జిలో వ్యభిచారం కొనసాగిస్తున్న శ్రీనివాస లాడ్జి యజమాని నరసింహారెడ్డి లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ పోలీసు స్టేషన్‌ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌ రెడ్డి తెలిపారు.

హైదరాబాద్‌లో చోరీ.. లింగంపేటలో విక్రయం

- ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- 8 బైక్‌లు స్వాధీనం

లింగంపేట: హైదరాబాద్‌లో బైక్‌లను చోరీ చేసి, లింగంపేటలో విక్రయిస్తున్న ఇద్దరిని శుక్రవారం హైదరాబాద్‌ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలు.. హైదరాబాద్‌లో బైక్‌లు చోరీ చేసే ముఠా వాటిని విక్రయించాలని లింగంపేట మండలం బోనాల్‌ గ్రామానికి చెందిన శివకుమార్‌గౌడ్‌, అయిలాపూర్‌ గ్రామానికి చెందిన మన్నె రాజుకు అప్పగించేవారు.

వారు మండలంలో పలు బైక్‌లు విక్రయించినట్లు పోలీసులు వెల్లడించారు. హైదరాబాద్‌లో చోరీకి పాల్పడుతున్న వ్యక్తులు దొరకడంతో వారు ఇచ్చిన సమాచారం మేరకు మండలంలోని నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి ఎనిమిది బైక్‌లను స్వాధీనం చేసుకొని జీడిమెట్ల పోలీస్‌ స్టేషన్‌కు తరలించారు.

అల్ప్రాజోలం పట్టివేత



పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

సదాశివనగర్‌: మండలంలోని పద్మాజీవాడి శివారు లో గురువారం రూ.ఐదు లక్షల విలువ చేసే అల్ప్రాజోలం పట్టుకొని, నలుగురిని అరెస్టు చేసినట్లు సీఐ సంతోష్‌కుమార్‌ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. మాచారెడ్డి మండలం ఘన్‌పూర్‌కు చెందిన చేపూరి ప్రశాంత్‌గౌడ్‌, గంభీరావ్‌పేట్‌ మండలం సీతారాంనగర్‌కు చెందిన పాపుగారి రాజు, సదాశివనగర్‌ మండలం పద్మాజీవాడి చౌరస్తాకు చెందిన బండమీది బాలాగౌడ్‌, కల్వరాల్‌కు చెందిన ఎండీ వాజీ రాజస్థాన్‌ నుంచి అల్ప్రాజోలం కొనుగోలు చేసి ఇక్కడ సరఫరా చేస్తున్నారు. వీరికి రాజస్థాన్‌కు చెందిన భవాని సింగ్‌, ముఖేష్‌ సింగ్‌ సరఫరా చేస్తున్నట్లు వెల్లడైంది. గురువారం పద్మాజీవాడి శివారులోని స్నేహ పౌల్ట్రీ ఫారం వద్ద అల్ప్రాజోలం డెలివరీ తీసుకుంటున్న ప్రశాంత్‌గౌడ్‌, రాజు, బాలాగౌడ్‌, వాజీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.ఐదు లక్షల విలువైన అల్ప్రాజోలం, రెండు కార్లు, రెండు బైక్‌లు, ఐదు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితులను శుక్రవారం రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు. ఈ కేసులో ముందస్తు సమాచారం సేకరించిన సీసీఎస్‌ ఇన్‌స్పెక్టర్‌ శ్రీనివాస్‌, సీఐ సంతోష్‌కుమార్‌, టాస్క్‌ఫోర్స్‌ ఇన్‌స్పెక్టర్‌ తిరుపయ్య, సదాశివనగర్‌ ఎస్సై రాజు, సిబ్బందిని ఎస్పీ సింధుశర్మ, డీఎస్పీ అభినందించారు.